క్లుప్తంగా

హెచ్‌ఎంలకు సన్మానం



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం కట్టా రవీంద్రాచారి, అలాగే బదిలీపై వచ్చి హెచ్‌ఎం బాధ్యతలు చేపట్టిన రామయ్యను లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం స్కూల్‌లో శాలువాతో సన్మానించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన అందించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో బొడ్డు సునీల్, బూర రామకృష్ణ, తేల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న సర్పంచ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి–ఇందిరానగర్ గ్రామ ప్రజలకు సురక్షిత, స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో సర్పంచ్ కొడిగూటి శారదప్రవీణ్ సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. బాలవికాస సాంఘిక సేవా సంస్థ నీటి శుద్ధీకరణ పథకం కింద ప్లాంట్ కోసం మంగళవారం రూ.2.65 లక్షల చెక్కును సంబంధిత బాధ్యులకు అందజేశారు.

బహుమతులు ప్రదానం



బహుమతులతో విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం శతమానం భవతి కార్యక్రమం నిర్వహించారు. కామర్స్ పూర్తి చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఇందిరాదేవి మాట్లాడుతూ కళాశాలలోని సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనరసింహమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టితరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



శంకరపట్నం: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను మండలంలోని చెంజర్ల గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. పెద్దూర్‌పల్లి శివారులోని గుట్టనుంచి అనుమతులు లేకుండా రోడ్డు పనుల నిమిత్తం మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. అనంతరం టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఆర్‌ఐ ప్రవీణ్ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, సేఫ్టీమోకులు ఇవ్వాలని, తాటి, ఈత వనాలకు వెళ్లేందుకు మోటారు వాహనాలు అందించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి తిరుపతిగౌడ్ కోరారు. 22న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను మంగలవారం ముదిమానిక్యంలో ఆవిష్కరించారు. పాత పద్ధతిలో తాటిచెట్లు ఎక్కేందుకు కార్మికులు ముందుకు రావడంలేదని, గీతవృత్తి అంతరించిపోనుందని, పెన్షన్ రూ.ఐదువేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేశం, సంపత్‌కుమార్, భద్రయ్య, రాజు, వెంకన్న, సత్తయ్య, రాజయ్య, బాలయ్య, రాజు ఉన్నారు.

జీపీ కార్యదర్శికి నివాళి

గంగాధర: మండలంలోని కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి మేర్గ రవీందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సభ

- కరెంటు బిల్లులు చెల్లించలేని దుస్థితిలో గ్రామపంచాయతీలు
- రూ. లక్షలు ఎలా చెల్లిస్తామని అధికారులపై సభ్యుల ధ్వజం



సర్వసభ్య సమావేశంలో ట్రాన్స్‌కో అధికారుల తీరుపై ధ్వజమెత్తుతున్న ఆయా గ్రామాల సర్పంచులు

చిగురుమామిడి: గ్రామ పంచాయతీలకు వచ్చే వేలాది రూపాయల కరెంటు బిల్లులు చెల్లించలేక సతమతమవుతున్నామని, అధికారంలోకి రాక ముందు ఉన్న బిల్లులను చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు ఒత్తిడి చేస్తున్నారని మండలంలోని ఉల్లంపల్లి , ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లి , నవాబుపేట్ గ్రామాల సర్పంచులు చెప్యాల మమత, బోయిని శ్రీనివాస్, సన్నీల్ల వెంకటేశం, సుద్దాల ప్రవీణ్ మండల సభలో అధికారులపై ధ్వజమెత్తారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొత్త వినీత అధ్యక్షతన నిర్వహించారు. అసలే చిన్న గ్రామపంచాయతీలు ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువ ఉండటంతో అనేక అవస్థలు పడుతుంటే 2019కి ముందు ఉన్న కరెంట్ బిల్లు రూ. ఆరు లక్షలు వచ్చిందని, తమ గ్రామపంచాయతీ వచ్చే ఆదాయం చాలా తక్కువ, గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితిలో పాలన సాగిస్తున్నామని మమత ఆరోపించారు. మరో నాలుగు నెలలైతే పదవులు కోల్పోతాం ఇప్పటికే పెట్టిన ఖర్చులు రాలేదన్నారు. వ్యవసాయబావులకు సంబంధించి ఫ్యూజ్ పోతే రెండు గంటలైనా వేసేవారులేరని సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి ప్రస్తావించారు. గ్రామాల్లో ట్రాన్స్‌కో సిబ్బంది సరిగా పనిచేయడంలేదని, ప్రజలు చెల్లించే పన్నుల నుంచి లక్షలాది రూపాయలు వేతనాలు పొందుతున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల సర్పంచులు పేర్కొన్నారు. మూడో అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో నిర్మించి ప్రహరీకి గేట్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ అందె స్వప్న కోరారు. రుణమాఫీ పథకాన్ని వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని, రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు భేతి రాజిరెడ్డి ఆరోపించారు. ఏఈఓలను రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతులకు సహకరించని బ్యాంకు అధికారులపై చర్యలకు సిఫారసు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. సర్పంచులు, ఎంపీటీసీలకు తెలియకుండానే పశుసంవర్ధకశాఖాధికారులు గొల్లకుర్మ యాదవు లతో సబ్సిడీ గొర్రెలకు డీడీలు కట్టిస్తున్నారని సర్పంచులు వెంకటేశం, శ్రీనివాస్ ఆరోపించారు. అనంతరం ఎంపీపీ కొత్త వినిత మాట్లాడుతూ... మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు డుమ్మాకొట్టడం సరైందని కాదన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ దృష్టికి విషయం తీసుకుపోయి తగిన చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. మన ఊరు మనబడి పథకం కింద 11 పాఠశాలల్లో రెండు పాఠశాలలు ప్రారంభించుకున్నప్పటికీ మిగిలిన తొమ్మిది పాఠశాలల్లో పనులు మందకొడిగా సాగుతున్నాయని, మహిళా టీచర్లు, విద్యార్థినులు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నర్సయ్య, తహసీల్దార్ నరేందర్, డీఈఈ లు బాల్‌రాజ్, రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకుసాగాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లింగాల మల్లారెడ్డి

గన్నేరువరం: మండల పరిషత్ ఆవరణలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పీచుపల్లి గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని సర్పంచ్ చంద్రారెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. సాంబయ్యపల్లెలో లూజ్‌లైన్లు ఉన్నాయని, సంబంధిత శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ చింతలపల్లి నర్సింహారెడ్డి కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ... అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతూ మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ భిక్షపతి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొలువుదీరిన గణనాథులు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. డప్పుచప్పుళ్లు, మేళతాళాల, కేరింతల మధ్య గణనాథుల విగ్రహాలను మండపాలకు తరలించారు. పలు వీధులను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. వివిధ రూపాల్లో గణనాథులు కొలువుదీరడంతో సందర్శకులతో మండపాలు సందడిగా మారాయి. విగ్రహాల వద్ద ఆయా గ్రామాల్లో గణేశ్ నవరాత్రోత్సవ కమిటీ బాధ్యులు, పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రోత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని హుజూరాబాద్ సీఐ బొల్లం రమేష్ అన్నారు. మండపాల వద్ద విద్యుత్ సరఫరా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతరులకు ఇబ్బంది పెట్టేలా సౌండ్ పొల్యూషన్ చేయొద్దన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. పలు మండపాల్లో మట్టి వినాయకులను ప్రతిష్ఠించారు. - సాక్షి నెట్‌వర్క్



హుజూరాబాద్‌లో కొలువుదీరిన వినాయకుడు



వీణవంకలో..



జమ్మికుంటలో పూజలు చేస్తున్న భక్తులు



రామడుగు: వెలిచాలలో..



రామడుగు: వెదిరలో..



చొప్పదండి: విద్యుత్ కాంతుల్లో గణేశుడు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గంగాధర: నియోజకవర్గంలో నిధులు మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధికారులు సూచించారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో మంగళవారం రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్‌శాఖ, మిషన్‌భగీరథ, సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆచంపల్లి గ్రామంలో గౌడ సంఘం భవనం నిర్మాణం పనులకు ఎమ్మెల్యే రూ. నాలుగు లక్షలు మంజూరు చేశారు. సంబంధిత ప్రొసీడింగ్ కులసంఘం నాయకులకు అందజేశారు. పనులు ప్రారంభించాలని, నిధులు సరిపోకపోతే మరిన్ని మంజూరు చేస్తామన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది గడ్డం లక్ష్మణ్‌ను బీఆర్‌ఎస్ చొప్పదండి నియోజకవర్గ లీగల్ ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే నియమించారు. ఈమేరకు నియామకం పత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన నాయకులకు గడ్డం లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

చిప్పకుర్తిలో ఈతచెట్లు ధ్వంసం



ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రామడుగు: మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. వరదకాలువ వెంట రాత్రివేళ ప్రొక్లెయిన్ వినియోగించి టిప్పర్ల ద్వారా భారీగా మట్టిని తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. చిప్పకుర్తి గ్రామశివారులో వరదకాలువ వెంట హరితహారంలో నాటిన ఈతమొక్కలను పీకి మట్టి తరలిస్తున్నారని గౌడకులస్తులు సోమవారం రాత్రి యంత్రాలను అడ్డుకున్నారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాదాపు వెయ్యి మొక్కలను ధ్వంసం చేశారని గౌడకులస్తులు తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర రాజాగౌడ్, నాయకులు తిరుపతిగౌడ్, మల్లయ్యగౌడ్, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అర్హులకు 'గృహలక్ష్మి' అమలు చేయాలి

గన్నేరువరం: అర్హులకు గృహలక్ష్మి పథకం అమలు చేయాలని మాదాపూర్ మహిళలు మంగళవారం డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

మట్టి సేకరించిన బీజేపీ నాయకులు

మానకొండూర్: మండలంలోని చెంజర్లలో మంగళవారం బీజేపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ మట్టి సేకరించారు. అమృత వాటిక నిర్మాణానికి నా దేశం నా మట్టి కార్యక్రమంలో భాగంగా మట్టి సేకరిస్తున్నామని తెలిపారు.

సీఎస్‌సీలను వినియోగించుకోవాలి

మానకొండూర్‌రూరల్: సాధారణ సేవా కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీఓ రామానుజాచార్యులు అన్నారు. మండలంలోని ఊటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం సీఎస్‌సీ కేంద్రాన్ని ప్రారంభించారు.

సర్పంచుల ఫోరం మండల కమిటీ

సైదాపూర్: సర్పంచుల ఫోరం సైదాపూర్ మండల కమిటీని ప్రకటించారు. ఈ నెల 14న అధ్యక్షుడిగా వెన్కెపల్లి సర్పంచ్ కొండా గణేశ్‌ను ఎన్నుకున్నారు. పూర్తి కమిటీని వెన్కెపల్లి గ్రామ పంచాయతీ దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా గాజర్ల సదానందం, గుండేటి సునితారాణి, ప్రధాన కార్యదర్శిగా మ్యాకల శిరీష, కోశాధికారిగా బొడిగె పద్మజ, కార్యదర్శిగా చింత లత, ఏనుగుల ఐలయ్య, సభ్యులుగా సరిత, రాజిరెడ్డి, కాంతమ్మ, అక్షయ, పాపయ్య, పద్మ, విజయ, కొమురయ్య ఎన్నికయ్యారని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే హామీల అమలు సాధ్యం

చొప్పదండి: హామీల అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్ అన్నారు. చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యంతో కలిసి పట్టణంలోని తొగిరిమామిడి కుంటలో పర్యటించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఇంటింటా వివరించారు.

రామడుగు: సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని, దేశ్‌రాజుపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సత్యప్రసన్నారెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: సాధ్యం కానీ హామీలను ఇచ్చి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీడబ్ల్యూసీ మెంబర్ తారిక్ హమీద్‌కర్ ఆరోపించారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో కాంగ్రెస్ పథకాలను ఇంటింటా వివరిస్తూ అవగాహన కల్పించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

తిమ్మాపూర్: కాంగ్రెస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి హెచ్చరించారు. మండలంలో 11 మంది కాంగ్రెస్ మద్దతుతో సర్పంచులుగా గెలిచారని గుర్తుచేశారు. కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే కాకముందే తిమ్మాపూర్ జెడ్పీటీసీగా పనిచేశాడని, ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణయం తీసుకుంటారన్నారు. రసమయి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో గెలవాలంటే ఏం చేశావో చెప్పాలన్నారు. వార్డు మెంబర్ పార్టీలో చేరకున్న కాంగ్రెస్ పార్టీ వారు చేరారని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందన్నారు.

ఆరెపల్లి మోహన్‌కు చుక్కెదురు

శంకరపట్నం: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌కు చుక్కెదురైంది. కాంగ్రెస్‌లో చేరేందుకు మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుతో మంతనాలు జరిపారు. 17న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. పార్టీ కండువా కప్పేందుకు రేవంత్‌రెడ్డి విముఖత చూపినట్టు సమాచారం.

నియామకం

జమ్మికుంట: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దాసరి రామ్మూర్తిని నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు కనకయ్యగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులకు రామ్మూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం

హుజూరాబాద్: మున్సిపల్ పరిధిలో గణపతి మండప నిర్వాహకుల సమస్యలను పరిష్కరిస్తూ సహకారంగా నిలిచేందుకు మంగళవారం గణపతి నిమజ్జన ఉత్సవ సమితి నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా బుర్ర నటరాజ్, ప్రధాన కార్యదర్శిగా పోతరవేని అనిల్, ఉపాధ్యక్షులుగా కొండ్ర నరేష్, చొల్లేటి రాజన్న, సహాయ కార్యదర్శులుగా రాకేశ్‌గౌడ్, అనిల్, కార్యనిర్వాహకులుగా ప్రభాకర్‌రెడ్డి, రాహుల్, సురేశ్, కోశాధికారిగా మొలుగూరి పూర్ణచందర్ ఉన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంఈవో కేతిరి వెంకటనర్సింహారెడ్డి, సీఐ బొల్లం రమేశ్ ప్రారంభించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీ సారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్, ఎంపిక పోటీలు ఈ నెల 20 నుంచి 22 తేదీల్లో నిర్వహించనున్నామని ఎంఈవో విడపు శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో తెలిపా. 20న అండర్–14, 17 ఖోఖో పోటీలు, 21న అథ్లెటిక్స్, వాలీబాల్, 22న కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని అర్హత గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ జిరాక్సులను మండలంలోని సిరిసేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అందజేయాలని, మరిన్ని వివరాలకు పీఈటీ సీహెచ్. శ్రీనివాస్ 8096791096 నంబర్ సంప్రదించాలని కోరారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వీణవంక: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల ఎకరాలు సస్యశ్యామలంగా మారాయని, గత ప్రభుత్వాలు ప్రాజెక్టులు నిర్మించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల కోసం రైతుబంధు, రైతబీమా వంటి పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఆడబిడ్డల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు ఉన్నారు.

చెక్కు అందజేత

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన పాడిరైతు సుదగోని ఎల్లయ్యగౌడ్ ఇటీవల మృతి చెందాడు. ప్రమాద బీమా కింద రూ.50 వేల చెక్కును మంగళవారం కరీంనగర్ డెయిరీ చైర్మన్ చలిమేడ రాజేశ్వర్‌రావు కరీంనగర్‌లో అందజేశారు. కార్యక్రమంలో డైయిరీ చైర్మన్ శంకర్‌రెడ్డి, మేనేజర్ సుధాకర్, డైరెక్టర్ తిరుపతిరెడ్డి, డెయిరీ గ్రామ చైర్మన్ జాగిరి శ్రీనివాస్‌గౌడ్, సుధగోని మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



ఆహ్వానిస్తున్న వెంకట్

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సమక్షంలో పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు వెనిశెట్టి ప్రకాశ్ మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై కాంగ్రెస్‌లో చేరుతున్నాని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష



హుజూరాబాద్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మంగళవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. నాయకులు రామచంద్రం, శ్రీనివాస్, వసంత్, రవీందర్, రాజ్ కుమార్, జీవన్ కుమార్, రాజేందర్, దేవస్వామి, బత్తుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ రవీందర్

చొప్పదండి: ఆన్‌లైన్ మోసాలపై అవగాహన ఉండాలని సీఐ గోపతి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో మంగళవారం షీ టీం, పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రిన్సిపాల్ స్వాతి, పర్శరాములు, కాంతయ్య, దేవేందర్, అజయ్, శ్రీనివాస్, రమేశ్, పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకురావాలి

జమ్మికుంట: రక్తదానంతో మరొకరి ప్రాణం కాపాడవచ్చని జమ్మికుంట టౌన్ సీఐ బార్పటి రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మారుతినగర్‌లో జయ బోర్‌వెల్, బేడ బుడగ జంగాల సంఘం మండల అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొల్సాని సత్యనారణరావు హాజరై మాట్లాడారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు సమక్షంలో శిబిరం నిర్వహించగా 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, బేడ బుడగ జంగాల సంఘం నాయకులు మల్లయ్య, శివ, గంగయ్య, సమ్మయ్య, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ కిషన్‌రావు, డీపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.